రేపు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం: సీఈవో

మామిళ్లగూడెం, జనవరి 28: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వీవీ అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30లకు ఈ సమావేశం ప్రారంభవుతుందని అన్నారు. ఉదయం గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆర్థిక, ప్రణాళిక సంఘాల సమావేశాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు వ్యవసాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘాల సమావేశాలు ఉంటాయని వివరించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

పలు కుటుంబాలకు ఎంపీ నామా పరామర్శ

ఖమ్మం, జనవరి 28: జిల్లాలోని పలు బాధిత కుటుంబాలను ఎంపీ నామా నాగేశ్వరరావు ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. వారి మరణాలకు నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఎంపీ నామా పరామర్శించిన వారిలో బిల్యానాయక్ తదితరుల కుటుంబాలు ఉన్నాయి. ఆయన ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు కూడా వెళ్లి పలు బాధిత కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు కనకమేడల సత్యనారాయణ, చిత్తారు సింహాద్రియాదవ్, చీకటి రాంబాబు, ధరావత్ రామ, అరుణ నాయక్, గుజారి అమర్‌సింగ్, మోతీలాల్, బానోత్ ఈరి, వాకదాని కోటేశ్వరరావు, చందులాల్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పరికలబోడు తండాకు చెందిన బానోత్ పార్వతి భౌతికకాయాన్ని కూడా ఎంపీ క్యాంపు కార్యాలయ బాధ్యులు సందర్శించి నివాళులర్పించారు.

'పెన్షనర్ల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి'

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏలూరి శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు

ఖమ్మం, జనవరి 28: పెన్షనర్ల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం కవిత మెమోరియల్ కళాశాలలో సంఘం బాధ్యుడు కే.సీతారాములు అధ్యక్షతన ఆదివారం జరిగిన తెలంగాణ సంక్షేమ శాఖల విశ్రాంతి అధికారుల సంక్షేమ వసతి గృహ అధికారుల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ శాఖల విశ్రాంతి ఉద్యోగుల అధికారుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు హెల్త్ కార్డు అమలు చేయాలని కోరారు. తరువాత కే.సీతారాములు రచించిన 'సంక్షోభంలో సంక్షేమ బాట' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంఘం నాయకులు పిచ్చిరెడ్డి, వెంకటనరసమ్మ, గంగయ్య సుదర్శన్, జయరాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కొరిపల్లి శ్రీనివాస్‌కు జాతీయ అవార్డు

ఖమ్మం సిటీ, జనవరి 28: ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు కొరిపల్లి శ్రీనివాస్‌కు న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీకి చెందిన కీర్తి పురస్కార్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సంస్థ చైర్మన్, ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ జోసఫ్ ఫాలంగి ఆదివారం ఈ మెడల్‌ను కొరిపల్లి శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీత శ్రీనివాస్ స్వస్థలం కామేపల్లి మండలం పాత లింగాల గ్రామం. ఆయన తల్లిదండ్రులు దివంగత కొరిపల్లి వెంకయ్య, వెంకటమ్మ దంపతుల పేరిట గత పదేళ్లుగా కేవీ వీవీ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగానే ఈ జాతీయ అవార్డు దక్కిందని వక్తలు వ్యాఖ్యానించారు. తన సామాజిక సేవలను గుర్తించిన సంస్థ పెద్దలకు కొరిపల్లి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ అవార్డు అందుకుంటున్న కొరిపల్లి శ్రీనివాస్

జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

మామిళ్లగూడెం, జనవరి 28: జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలువురు పోలీసులు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తున్నారు. ఉత్తర్వులు అందుకున్న ఎస్ఐలు వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బదిలీ అయిన ఎస్ఐల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
షేక్ షకీర్	సీసీఆర్‌బీ ఖమ్మం రూరల్ అటాచ్‌డ్	ఎస్ఐ కల్లూరు
పుడారి రఘు	ఎస్ఐ కల్లూరు	వీఆర్ ఖమ్మం
బలుగూరి కొండలరావు	రఘునాథపాలెం	ఎస్ఐ తల్లాడ
పోగుల సురేశ్	తల్లాడ	వీఆర్ ఖమ్మం
కరి వెంకటేశ్	ఖమ్మం వన్‌టౌన్	వీఎం బంజర
గుగులోత్ సూరజ్	వీ ఎం బంజర	వీఆర్ ఖమ్మం

సమాజాన్ని మార్చగలిగే శక్తి సాహిత్యానిదే..

◆ 'అక్షరాల తోవ' 6వ వార్షికోత్సవంలో వక్తలు

ఖమ్మం, జనవరి 28: సమాజాన్ని మార్చగలిచే శక్తి సాహిత్యానిదేనని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీ సంస్థ 'అక్షరాల తోవ' ఆరో వార్షికోత్సవ సభ ఖమ్మం రిక్కా బజార్ హైస్కూల్ ప్రాంగణంలో సంస్థ బాధ్యుడు నామా పురుషోత్తం అధ్యక్షతన ఆదివారం జరిగింది. తొలుత అంతర్జాతీయ స్థాయిలో గెలుపొందిన కథలు, కవితలతో ప్రచురించిన వార్షికోత్సవ సంచికను ప్రముఖ కవి, విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవీ) ఆవిష్కరించారు. అనంతరం మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్యంలో విశేషకృషిని అందిస్తున్న అక్షరాల తోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ అభినందనీయులన్నారు. కథా విజేతలకు పురస్కారంతో పాటు నగదు బహుమతులందజేశారు. ప్రముఖ రచయితలు, కవులు, అక్షరాల తోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్, కవులు సయ్యద్ షఫీ, కన్నెగంటి వెంకటయ్య, కొమ్మవరపు కృష్ణయ్య, మేడగాని శేషగిరి, గద్దపాటి శ్రీనివాస్, షుకూర్, తోట సుభాషిణి, ఇబ్రహీం నిర్గుణ్ తదితరులు పాల్గొన్నారు. మొగిలి గుణకర హస్యవల్లరి, పాగి వెంకన్న, మూస పాటలు సభికులను అలరించాయి.

వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న మువ్వా శ్రీనివాసరావు తదితరులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కూసుమంచి, జనవరి 28: కూసుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 42 సంవత్సరాల తరువాత ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు బేబీ చంద్ర, సత్తిరెడ్డి, రామకృష్ణ, శ్రీరామారావు, నర్సయ్యను పూర్వ విద్యార్థులు సన్మానించారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు. పూర్వ విద్యార్థులు కూరపాటి రామారావు, దామళ్ల పాపారావు, నాజర్, కూరపాటి వనజ, బతకమ్మ, పిట్టల వెంకటేశ్వర్లు, విజయ్‌రావు, శీలం గురవయ్య, శీలం లచ్చయ్య పాల్గొన్నారు.

చింతకాని, జనవరి 28 : మండల పరిధిలోని తిమ్మినేనిపాలెం ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తోటి మిత్రులనున ఆత్మీయంగా పలకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువులను శాలువా, మెమోంటోలతో సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, చిరంజీవి, శ్రీరాం, కిరణ్మయి, నాగేంద్రయ్య, బాబు, మణికుమార్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కూసుమంచి : ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, చింతకాని : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న తిమ్మినేనిపాలెం పూర్వ విద్యార్థులు

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని, జనవరి 28: మండల పరిధిలోని కొదుమూరు గ్రామానికి చెందిన షేక్ సుభానీ ఇంటి ప్రహరీకు సంబంధించి గేటు ధ్వంసం చేసిన ఘటనపై ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రామలింగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామారావు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ, జనవరి 28: మండలానికి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారంయడవల్లి లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆరెంపుల అచ్చయ్య (55) కొద్దికాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 16న హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆదివారం కడుపు నొప్పి తాళలేక ఆస్పత్రి భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు.

19 కేజీల గంజాయి పట్టివేత

కూసుమంచి(నేలకొండపల్లి), జనవరి 28: పాలేరులో 19 కేజీల గంజాయిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఒడిస్సాకు చెందిన బైరాగి అనే వ్యక్తి 19 కేజీల గంజాయిని బ్యాగులో హైదరాబాద్ తరలిస్తుండగా నేలకొండపల్లి పోలీసులు పట్టుకున్నారు. బైరాగిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పోలిశెట్టి తెలిపారు. ఎస్సై రాధాకృష్ణ, శంకర్, సిబ్బంది రామారావు, హరీష్, సునీత, సంపూర్ణ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్న గంజాయి, నిందితుడితో పోలీసులు

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

సత్తుపల్లి రూరల్, జనవరి 28: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్సై కుషకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సదాశివునిపేట-తుంబూరు గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం కోడి పందాలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై, సిబ్బంది అక్కడకు వెళ్లారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2వేల నగదు, రెండు కోళ్లు స్వాధీనపర్చుకున్నారు. కేసులు నమోదు చేశారు.

వేంసూరు, జనవరి 28: మర్లపాడు గ్రామ శివారులో కోడి పందాల స్థావరంపై ఎస్సై వీరప్రసాద్, సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.7,100 స్వాధీనపర్చుకున్నారు.

బెటాలియన్‌లో దంత, నేత్ర వైద్య శిబిరాలు

సత్తుపల్లి రూరల్, జనవరి 28: మండలంలోని గంగారం 15వ బెటాలియన్‌లో ఆదివారం ఉచిత దంత, నేత్ర వైద్య శిబిరాలను లయన్స్ క్లబ్, బెటాలియన్ సంయుక్తంగా నిర్వహించాయి. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు ప్రారంభించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు, వారి కుటుంబీకులకు వైద్యులు బి.శ్రీనివాస్, జూపల్లి వెంగళ్ రావు, పెద్దిరాజులు వైద్య సేవలందించారు. సహాయ దళాధిపతి ఎన్.వెంకన్న, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బాధ్యులు డి.కృష్ణయ్య, రమేష్, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్ వెంకటరాములు

సేవారత్న అవార్డు ప్రదానం

సత్తుపల్లి, జనవరి 28: సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న యువభారత్ శక్తి ఫౌండేషన్‌కు భారత సేవారత్న అవార్డును ఏపీలోని విశాఖకు చెందిన తాసుబెల్లి ఫౌండేషన్ ప్రకటించింది. ఆదివారం జరిగిన సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఫౌండేషన్ చైర్మన్ శంకర్‌కు అవార్డు 'తాసుబెల్లి' బాధ్యులు అందించారు.

సత్కారం అందుకుంటున్న క్రాంతి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శికి ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్ పరామర్శ

మధిర, జనవరి 28: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఖమ్మం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వీరి వెంట బోనకల్లు మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ ఉన్నారు.

తమ్మినేనిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

చింతకాని, జనవరి 28 : యూటీఎఫ్ మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో మండల అధ్యక్షుడిగా తోటకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఉదారపు నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా జయాకర్, ఉపాధ్యక్షుడిగా మన్నేపల్లి విజయలక్ష్మి, రామనరసింహారావు, కార్యవర్గ సభ్యులుగా పడిగల నరసింహారావు, భాగ్య, సుధాకర్‌రావు, రమణ, సీహెచ్ వాసు, విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు చావా దుర్గాభవాని, నాయకులు సామినేని నాగేశ్వరరావు, యూటీఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

పెనుబల్లి, జనవరి 28: కారాయిగూడెం గ్రామస్తులు అద్దంకి లక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఆమెది నిరుపేద కుటుంబం. లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తగిరి వీ.ఎం.బంజర బాధ్యులు ఆదివారం బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. దేశిన్ని నివాసరావు, మిట్టపల్లి జనార్దన్, అబ్దుల్ సలాం, పోట్రు వెంకటేశ్వరరావు, సుంకర సత్యనారాయణ, పొన్నగంటి వినాయకప్రసాద్ పాల్గొన్నారు.

సరుకులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోట మైసమ్మ ఆలయంలో పూజలు

కారేపల్లి, జనవరి 28: ఉసిరికాయలపల్లి కోట మైసమ్మ దేవాలయంలో ఆదివారం పూజారి కొత్తలంక కైలాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయడం లేదు

మధిర, జనవరి 28: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులైనప్పటికీ ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని బీజేపీ మధిర కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాల అమలు విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చిలివేరు సాంబశివరావు, బాపట్ల రమేశ్, పగడాల నాగేంద్ర బాబు, గరిడేపల్లి వేణు, రామకృష్ణ, కనకాచారి పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి స్నేహితుల సాయం

సత్తుపల్లి రూరల్, జనవరి 28: సత్తుపల్లి మండలం గంగారం ప్రభుత్వ పాఠశాల 1986-87 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. తమ సహాధ్యాయురాలైన పిల్లి సలోమి, క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకుని స్పందించారు. వారంతా కలిసి ఆదివారం పెనుబల్లి మండలం లంకపల్లిలోని సలోమి ఇంటికి వెళ్లి, వైద్య ఖర్చులకు రూ.50వేలు అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కొండపల్లి కొండలరావు, లక్ష్మణ్‌సింగ్, పున్నం రామమూర్తి, సోయం నాగేశ్వరరావు, సోయం వెంకటేశ్వరరావు, డి.రామకృష్ణ, తన్నీరు శ్రీనివాసరావు, జంగాల నాగభూషణం, డివిఎస్ఎన్.రెడ్డి, ఎండి.ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెనుబల్లి, జనవరి 28: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2.00 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఉంటుందని ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని, సమయ పాలన పాటించాలని కోరారు.

మంత్రి తుమ్మలకు సన్మానం

మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న రిటైల్ వ్యాపారులు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 28: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఏఎంసీ రిటైల్ కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ఎండీ ఫజల్ ఆధ్వర్యంలో వ్యాపారులు మంత్రిని కలిసి పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సత్కరించారు. మార్కెట్లో ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సాధనతో ఏదైనా సాధ్యమే: గుండాల కృష్ణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 28: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యం కోసం ఇష్టపడి చదవాలని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ సూచించారు. కష్టపడి చదువుతూ లక్ష్య సాధనకు కృషి చేస్తే ఏదైనా సాధ్యమేనని స్పష్టం చేశారు. ఎస్‌బీఐటీ కళాశాలలో ఐబీవో ఆధ్వర్యంలోమూడోతరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ఆదివారం నిర్వహించిన ప్రతిభా పరీక్షలను పరిశీలించి మాట్లాడారు. అకడమిక్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

4న బీఆర్ఎస్ సమావేశం

మాట్లాడుతున్న మదన్‌లాల్

వైరా టౌన్, జనవరి 28: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 4న వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం జరుగుతుందని ఆ పార్టీ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ తెలిపారు. వైరాలో ఆదివారం పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో పార్టీ అగ్ర నేతలతోపాటు ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొంటారని చెప్పారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ ఒలింపియాడ్‌కు బేబీమూన్ విద్యార్థులు

విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ కేసా వీరన్న

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 28: ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో నగరంలోని బేబీమూన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ కేసా వీరన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కేసా భాస్కర్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను డైరెక్టర్ ఆంతోటి రామకృష్ణ అభినందించారు.

జ్యోతీబా పూలే పాఠశాలలో ఫేర్‌వెల్ డే

ఫేర్‌వెల్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

రఘునాథపాలెం, జనవరి 28: రఘునాథపాలెంలోని దానవాయిగూడేనికి చెందిన మహాత్మా జ్యోతీబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలు జరిగాయి. 10వ తరగతి విద్యార్థినులకు వీడ్కోలు పలుకుతూ 9వ తరగతి విద్యార్థినులు నిర్వహించిన వేడుకలు ఆద్యంతం సందడిగా సాగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పిన్సిపాల్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక

సాయిలిఖిత

వైరా టౌన్, జనవరి 28: మండలంలోని కెజి సిరిపురం విద్యార్థిని ఐనాల సాయిలిఖిత, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్) నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైంది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మూడు రోజులపాటు జరగనున్న పోటీలకు రాష్ట్ర జట్టుతోపాటు ఆదివారం వెళ్లింది. రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ) కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది.

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నివాళి

వైరా రూరల్, జనవరి 28: మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం పలువురి దశదిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ హాజరయ్యారు. మృతుల చిత్రపటాల వద్ద పూలు చల్లి నివాళి అర్పించారు.

చీరలు పంపిణీ

సత్తుపల్లి టౌన్, జనవరి 28: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గల ప్రార్థనా మందిరంలో 50 మంది పేద వృద్ధులకు ఉపాధ్యాయులు కొళకానూరి బాలస్వామి-సబిత దంపతులు ఆదివారం చీరలు సమకూర్చారు. వీటిని వీరి తరపున ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్, అలవాల లక్ష్మి పంపిణీ చేశారు.

చీరలు పంపిణీ చేస్తున్న కరుణాకర్

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

కావలెను

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

ఉద్యోగ అవకాశాలు

★ మా సంస్థ నందు JOB చేయుటకు, 10th, Inter, డిగ్రి ఆపై చదివే స్థోమత లేని నిరుద్యోగ యువతీయువకులు కావలెను. Age:18-24లోపు ముఖ్యగమనిక నో ఫీ, రూం ఫ్రీ, సంప్ర||8143293596.
NLG-310749

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616